సాక్షి
పెద్దపల్లి

శనివారం । 25 । నవంబర్ । 2023



నేత్రపర్వంగా గంగాహారతి

ధర్మపురి: గోదావరినది వద్ద చేపట్టిన గంగాహారతి శుక్రవారం 11వ రోజుకు చేరింది. ప్రత్యేక పూజలు చేసి దీపాలు వదిలారు.



వైభవంగా కృష్ణతులసీ కల్యాణం

వేములవాడ: రాజన్న ఆలయంలో శుక్రవారం రాత్రి కృష్ణతులసీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకబృందం ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు.

గరిష్టం/కనిష్టం
26.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఈవీఎంల కమిషనింగ్‌పై అప్రమత్తం



సూచనలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్/రామగిరి: ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో శుక్రవారం చేపట్టిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రామగిరి జేఎన్టీయూలోని ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో అదనపు బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసి ఈవీఎంల కమిషనింగ్ చేపట్టామని వివరించారు. పెద్దపల్లి సెగ్మెంట్ పరిధిలో 290 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటికి అదనంగా 25శాతం బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 40శాతం అదనంగా వీవీ ప్యాట్లు కమిషనింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు 735 బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వీవీ ప్యాట్లు కమిషనింగ్ చేయాల్సి ఉందని ఆయన వివరించారు. కలెక్టర్ వెంట రిటర్నింగ్ అధికారి మధుమోహన్, తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పారా మిలటరీ బలగాల రాక



ప్లాట్‌ఫామ్‌పై పారా మిలటరీ బలగాలు

రామగుండం: ఎన్నికల బందోబస్తు నిర్వహించేందుకు శుక్రవారం అదనంగా పారా మిలటరీ బలగాలు చేరుకున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి పలు కంపెనీలకు చెందిన వందలాది బలగాలు రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరాయి. గోదావరిఖని ఏసీపీ సుందర్, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై వెంకట్ తదితరులు బలగాలకు ప్రత్యేక వాహనాలు సమకూర్చి వారికి కేటాయించిన కేంద్రాలకు తరలించారు. పారామిలిటరీ బలగాల చీఫ్‌కు ఏసీపీ సుందర్ స్వాగతం పలికారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా బలగాలను నియమించినట్లు అధికారులు తెలిపారు. తొలిరోజు మంచిర్యాల జిల్లాలోని వివిధ కేంద్రాలకు సిబ్బంది చేరుకోగా, మంథని నియోజకవర్గంలోని రామగిరి మండలానికి మరికొన్ని బలగాలు వచ్చాయి. మరో మూడు రోజుల్లో రామగుండం, పెద్దపల్లి, మంథని జిల్లాలకు ఇంకా కొన్ని బలగాలు రానున్నట్లు అధికారులు వివరించారు.

ఉత్పత్తి దశలోకి ఆర్‌ఎఫ్‌సీఎల్



ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో అమోనియా పైప్‌లైన్ లీక్ కావడంతో నవంబర్ 16న షట్‌డౌన్ చేసిన విషయం విదితమే. వారం రోజులు కర్మాగారంలో మరమ్మతు వేగవంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ప్లాంట్‌ను పునః ప్రారంభించారు. ప్రస్తుతం యూరియా ఉత్పత్తి కోసం స్టీమ్ ఉత్పత్తి చేస్తున్నారు. శనివారం రాత్రి యూరియా ఉత్పత్తి అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

3వరకు పత్తి కొనుగోళ్లు బంద్

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 27 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ శుక్రవారం తెలిపారు. 27న కార్తీక పౌర్ణమి అని, ఆ తర్వాత ఎన్నికలు, వారాంతపు సెలవులు ఉన్నాయని పేర్కొన్నారు. డిసెంబర్ 4నుంచి మళ్లీ పత్తి కొనుగోళ్లు జరుగుతాయని వివరించారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్‌కు పత్తి తేవొద్దని ఆయన సూచించారు.

పత్తి ధర రూ.6,811

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.6,811 ధర పలికింది. కనిష్టంగా రూ.5,911 ధర పలికింది. సగటు ధర రూ.6,711గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

జంగ్ తెలంగాణ

ఆలోచించి ఓటెయ్యండి

- ఉద్యమకారుడు కోరుకంటి చందర్‌ను గెలిపించండి
- రామగుండాన్ని పారిశ్రామిక వాడగా మారుస్తాం
- గోదావరిఖని ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



సభకు హాజరైన ప్రజలు

సాక్షి, పెద్దపల్లి: 'ఎన్నికలు వచ్చాయంటే ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి. తెలంగాణ ప్రజల హక్కుల కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థుల వెనుక ఉన్న పార్టీలను చూడాలి. వాటి నడవడిక, దృక్పథం ఏంటో తెలుసుకోవాలి. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం గెలవమంటే ఎట్లా?' అని సీఎం కేసీఆర్ అన్నారు. శుక్రవారం రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలోని గోదావరిఖని జవహర్‌లాల్‌నెహ్రూ సింగరేణి స్టేడియంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సింగరేణి తెలంగాణ కొంగుబంగారమని, అటువంటి సింగరేణిని ముంచింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఊడగొట్టింది, 49శాతం వాటా కేంద్రప్రభుత్వానికి అప్పజెప్పింది కాంగ్రెస్ పార్టీయే అనే విషయాన్ని కార్మికులు గుర్తుంచుకోవాలని సూచించారు. కోరుకంటి చందర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, ఆయన తెలంగాణ ఉద్యమకారుడని అన్నారు. ఉద్యమ కాలంలో 74రోజులపాటు జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఆయన కూడా సింగరేణి కార్మికుడి కుమారుడేనని, సింగరేణి గురించి బాగా అవగాహనం ఉందని చెప్పారు. ఇక్కడ బొగ్గు, నీళ్లు తదితర వనరులు ఉన్నాయయని, రవాణా వసతి ఉందని, రైలు మార్గం ఉందని, అయినా, పరిశ్రమలు లేవని చందర్ చెప్పారని సీఎం కేసీఆర్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో రామగుండం నిర్లక్ష్యానికి గురైందని, మనం ఇప్పుడు కుదుటపడ్డామని తెలిపారు. ఈ ప్రాంతానికి రావాల్సిన పరిశ్రమల గురించి ఆలోచించి తీసుకువస్తానని కేసీఆర్ మాట ఇచ్చారు. రామగుండాన్ని పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేసుకుందామని కేసీఆర్ తెలిపారు.

ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్

'తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్. గోదావరి ఒరుసుకుంటూ పారే మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో మంచినీళ్ల గోస, కరెంటు గోస, చేనేత కార్మికుల చనిపోవుడు, రైతులు ఆత్మహత్యలు చేసుకునుడు, కరెంట్ ఇస్తే తెల్లందాకా ఇంత, పొద్దందాకా ఇంత, ఆడ పాములు కరిచి చనిపోవుడు.. ఇలా విపరీతమైన బాధలు పడ్డాం' అని సీఎం అన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉండేవని, వాటిని ఊడగొట్టింది కాంగ్రెస్సే కదా? అని ప్రశ్నించారు. గవర్నమెంట్ కాంగ్రెస్సేనని, ఒప్పందాలపై సంతకాలు పెట్టి ఉన్న హక్కులను పోగొట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించుకున్నామని అన్నారు. అంతేకాకుండా 15వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నామని చెప్పారు. కాంగ్రెస్‌వాళ్లు ఉన్నప్పుడు ఇవ్వలేదని, తాము ఇస్తుంటే ఓర్వలేరని సీఎం కేసీఆర్ విమర్శించారు.

ఆలరించిన ఆటాపాట

సింగరేణి స్టేడియంలో నిర్వహించిన సభకు భారీగా జనం తరలిరాగా, ఏపూరి సోమన్న తన ఆటాపాటలతో జనాలను ఉర్రూతలూగించారుర 'గుర్తు గుర్తుంచుకో రామక్క' అని ఆలపించిన సమయంలో స్టేడియంలో గులాబీ శ్రేణులు సైతం పాదం కలిసి నృత్యాలు చేశారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో గులాబీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే, 'గోదావరిఖని కదా.. జర గట్లనే ఉంటుంది' అని సీఎం కేసీఆర్ పేర్కొంటూ సభికులను మరింత ఉత్సాహపరిచారు.




గోదావరి నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మించాలి : కోరుకంటి

గోదావరి నదిపై కేబుల్ బ్రిడ్జ్ నిర్మించి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. అలాగే అన్ని వనరులు కలిగి ఉన్న రామగుండం నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చి, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి. కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యాక రామగుండం వచ్చి సమస్యలపై సమీక్షించి పరిష్కారించాలని కోరుతున్నా.

నారీ.. ప్రాధాన్యమేది?

ఓట్లున్నా.. సీట్లు లేవు

- ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు
- పురుష ఓటర్లు 14,40,023
- మహిళా ఓటర్లు 14,96,622
- బీఆర్ఎస్ నుంచి 0, బీజేపీ నుంచి 04, కాంగ్రెస్ నుంచి 0, బీఎస్పీ నుంచి 01
- మహిళలను విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలు
- అతివకు అసెంబ్లీకి దక్కని ప్రాధాన్యం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఆకాశంలో సగం.. అవనిలో సగం.. అని మహిళల గురించి చెప్పే మాటలు బాగానే ఉన్నా.. ఆచరణలోకి వచ్చేసరికి ఎవరూ పాటించడం లేదు. రాజకీయాల్లోకి రావాలన్న ఆసక్తి ఉన్నా.. అవకాశాలు లేక మహిళలు అట్టడుగునే ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో చూసుకుంటే.. మొత్తం ఓటర్లలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఆ మేరకు రాజకీయంగా మాత్రం వారికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వలేదు.

శాసనకర్తలు మహిళలు ఉంటే ఆ వర్గానికి మరింత న్యాయం జరుగుతుందనేది అందరూ ఏకీభవించాల్సిన వాస్తవం. మహిళలు అంతరిక్షంలో అడుగుపెడుతున్న ప్రస్తుత ఆధునిక యుగంలో రాజకీయాల్లో మాత్రం వారికి అంతగా ప్రాధాన్యం లభించడం లేదనే చెప్పవచ్చు. ఇందుకు ప్రస్తుత శాసనసభ ఎన్నికలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ప్రధానపార్టీల నుంచి 36 మంది బరిలో నిలిస్తే అందులో మహిళలు కేవలం ఐదుగురు మాత్రమే ఉండడం ఆయా పార్టీల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇందులో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నుంచి మహిళలకు అసలే ప్రాధాన్యం దక్కకపోగా, బీజేపీ నుంచి రామగుండం, సిరిసిల్ల, చొప్పదండి, జగిత్యాల సీట్లు అతివలకు కేటాయించారు. పెద్దపల్లి నుంచి బీఎస్పీ మహిళను బరిలో నిలపింది. బీజేపీ నాలుగు స్థానాలు కేటాయించి అగ్రస్థానంలో నిలిచింది. మహిళలు సైతం స్వతంత్రంగానైనా బరిలో నిలిచే సాహసం చేయకపోవడం సమాజంలో మహిళలంటే వివక్ష దూరం కాలేదన్న వాదనకు తెరలేపుతోంది.

దేశవ్యాప్తంగా ఇలా...

1998–2023 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 21,161 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నిక కాగా.. వారిలో మహిళల సంఖ్య 1,584 మాత్రమే. ఏపీ, తెలంగాణ సహా దేశంలో 19 రాష్ట్రాల్లో మహిళా శాసనసభ్యులు 10 శాతానికి మించి లేరు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 1,821 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. అందులో బరిలో నిలిచిన మహిళల సంఖ్య 140 మాత్రమే. కానీ.. అందులో గెలిచిన మహిళల సంఖ్య కేవలం ఆరుమాత్రమే.

అన్ని జిల్లాల్లో ఎక్కువే..

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములు మహిళలే శాసించనున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. రాజకీయ పార్టీలు మహిళల జనాభా, ఓటర్లకు అనుగుణంగా రాజకీయ అవకాశాలు కల్పించడం లేదన్న అసంతృప్తి ఉంది. 50 శాతం రిజర్వేషన్ల పుణ్యమాని స్థానిక సంస్థల్లో సగానికిపైగా ప్రజాప్రతినిధులు మహిళలకు అవకాశం దక్కుతోంది. కానీ.. అసెంబ్లీకి వచ్చేసరికి మాత్రం మహిళలకు ప్రాధాన్యం దక్కడం లేదు. రాజకీయ పార్టీలు.. వారికి పోటీ చేసేందుకు ఇస్తున్న సీట్లు, అందులో వారు గెలిచే స్థానాలు.. పురుషులతో పోల్చితే చాలా తక్కువగా ఉంటున్నాయనే విమర్శ ఉంది.

రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో...

2018 ఎన్నికల్లో తెలంగాణలో ఖానాపూర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి అజ్మీరా రేఖానాయక్, మెదక్ నుంచి పద్మాదేవేందర్ రెడ్డి, మహేశ్వరం నుంచి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి, ఆలేరు నుంచి గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, ములుగు నుంచి సీతక్క, ఇల్లందు నుంచి బానోతు హరిప్రియ ఎన్నికయ్యారు. ఈ లెక్కన 119 నియోజకవర్గాల్లో ఎన్నికైన మహిళా శాసనసభ్యుల సంఖ్య కేవలం ఐదు శాతం మాత్రమే.

33 శాతం రిజర్వేషన్ అమలైతే..

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదం పొందింది. అది చట్టంగా మార్చితే మహిళలకు ఆ మేరకు సీట్లు కేటాయించడం తప్పనిసరి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2027 తర్వాతే ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకు వస్తామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. చట్టం అమల్లోకి వస్తే 12 నియోజకవర్గాలకు గాను ప్రతీ పార్టీ సుమారు నాలుగేసి స్థానాలు విధిగా కేటాయించాల్సి ఉంటుంది.

ఊరు మునిగింది.. జ్ఞాపకం మిగిలింది

ఒక ఊరి కథ

- గోదావరిలో ఉత్తరవాహిని పుణ్యస్నానాలకు మంగళం
- పురాతన ఆలయాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు
- ఆందోళన చెందుతున్న ముర్మూరు గ్రామస్తులు



పాతాళేశ్వరస్వామి ఆలయం

రామగుండం: అది ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు ముంపు గ్రామం.. ముంపునకు గురైన తొలిఊరు.. అంతకుమించి దశాబ్దాల చారిత్రక, సాంస్కృతిక వైభవం కలిగిన ప్రాంతం.. అక్కడ నివాసం ఉన్నవారికి చరిత్రలో దక్కిన గౌరవం.. సమీప గోదావరి నదిలో ఉత్తర వాహిని స్నానాలు ఆచరిస్తే ఎంతో పుణ్యఫలం లభిస్తుందనే నమ్మకం ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాల్లోంచి తరలివచ్చే భక్తుల్లో ప్రగాఢంగా ఉండేది.. ఇప్పుడవన్నీ చరిత్రలో కలిసి పోయాయి.. జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి.. ఆ ప్రాశస్త్యంగల ఊరే ముర్మూరు.

మునిపురం నుంచి ముర్మూరు వరకు..

శతాబ్ద క్రితం ఆ ఊరు మునిపురంగా పిలిచేవారని, మునులు నివసించిన ఆనవాళ్ల కనిపించడంతో ఆ పేరు వచ్చిందని, కాలక్రమంలో ముర్మూరుగా ఆవిర్భవించిందని చరిత్ర చెబుతోంది.

- గోదావరి నది ఉత్తర వాహినిలో సుమారు రెండు కిలో మీటర్ల మేర ప్రవహించడం ఈ గ్రామం ఎంతోపవిత్రమైనదని భావిస్తున్నారు.
- కార్తీక మాసం, శివరాత్రి తదితర ఉత్సవాల సందర్భంగా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఇక్కడకు వస్తున్నారు.
- ఇక్కడ స్నానాలు ఆచరిస్తే కాశీలోని గంగానదిలో చేసినంత పుణ్యఫలం లభిస్తుందనే విశ్వాసం ఉంది.

పర్యాటకానికి అనుకూలం

పాతాళేశ్వరాలయంలో సైకత శివలింగం ఉంది. గ్రామం చుట్టూ 101 ఆంజనేయ విగ్రహాలతో అష్టదిగ్బంధనం చేశారు. ఇక్కడ అత్యధికంగా బ్రాహ్మణ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పౌరోహితం ఉపాధిగా ఉంది. రాజుల గడిలకోట ఇప్పటికీ దర్శనం ఇస్తోంది. శ్రీచక్రంపై ఆశీనులైన చెన్నకేశవ స్వామి చెక్కు చెదరకుండా ఉంది. ఇది పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అనుకూలంగా ఉంది.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..

ప్రస్తుతం గోదావరి నదిలో నీటిపారకం తగ్గింది. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో మునిగిన శ్రీపాతాళేశ్వర, శ్రీచెన్నకేశవ ఆలయాలు పైకి తేలాయి. దీంతో బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేస్తూ స్మృతులు గుర్తుచేసుకుంటున్నారు. అంతేకాదు.. పునరావాస కాలనీలోని ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. మరోవైపు.. పురాతన ఆలయాల్లో గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు చేపట్టారు.

ఎంతచెప్పినా తక్కువే

దశాబ్దం క్రితం వరకు భక్తులు ఉత్తర వాహనిలో స్నానమాచరించి పాతాళేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాల్లో పూజలు చేసి పునీతులయ్యేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి.

– కమ్మల సత్యనారాయణశర్మ, పూజారి

ఉత్సవ విగ్రహాలు భద్రం

పాతాళేశ్వరాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఆ సమయంలో కొన్ని విగ్రహాలు ధ్వంసమయ్యాయి. చెన్నకేశవస్వామి, శ్రీచక్రం విగ్రహాలను పునరావాస కాలనీలో ప్రతిష్ఠించాలనుకున్నా విరిగిపోయే ప్రమాదం ఉందని పురోహితులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా కొన్నింటిని సురక్షితంగా తీసుకొచ్చి కొత్త ఆలయంలో ప్రతిష్ఠాపన చేశాం.


– బాదరవేణి స్వామి, సర్పంచ్

పవిత్రత కాపాడాలి


మేం పుట్టక ముందే ఆలయాలు ఉన్నాయి. ప్రాజెక్టు నీట మునిగి ఆలయాల ప్రాశస్త్యం దెబ్బతిన్నది. పునరావాసకాలనీలో దేవతా విగ్రహాలను స్థపతులతో ఎంతోఅందంగా చెక్కించి ప్రతిష్ఠాపన చేశారు. వాటి పవిత్రతను కాపాడాలి.

– పెంద్యాల విమలమ్మ, పూజారి


ముసురుకున్న వాన



కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు



మార్కెట్‌లో ధాన్యం నిల్వలు



చేతికి వచ్చిన పత్తి పంట

- అన్నదాతల ఆందోళన

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్(మంథని): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు కురిశాయి. పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. ఇతరత్రా నష్టాలు కూడా ఏమీ నమోదు కాలేదు. కానీ, ఆకాశం పూర్తిగా మేఘావృతం కావడంతో పత్తి, వరి పంటలకు తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వరి కోసి ఆరబోసిన వడ్లు, కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యంలో తేమ అధికమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పుడిప్పుడు చేతికి వచ్చే పత్తి రంగు మారే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

కమాన్‌పూర్ మండలంలో..

వివిధ గ్రామాల్లో ఉదయం తేలికపాటి వర్షం పడింది. దీంతో చేతికి వచ్చిన పత్తి, వరి కోతలకు ఆటంకం ఏర్పడింది. అయితే, తేలికపాటి వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యంలో తేమశాతం పెరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏరదానికి వచ్చిన పత్తి నల్లబడిపోతోందని అంటున్నారు.

భయపెడుతున్న మబ్బులు

కమాన్‌పూర్/సుల్తానాబాద్: ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకున్నాయి. కోతదశకు వచ్చిన, కల్లాల్లో ధాన్యం పోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అక్కడక్కడా చిరుజల్లులు కురవడంతో వరి పైరుకు నష్టం జరుగుతుందని అన్నదాతలు ఆవేదనవ్యక్తం చేశారు. కల్లాల్లో ఆరబోసిన, కొనుగోలు కేంద్రాలకు తరలించి నిల్వచేసిన వడ్లలో తేమశాతం పెరుగుతుందని భయపడుతున్నారు.

'దోపిడీ పాలకవర్గాలను ఓడించాలి'

గోదావరిఖని: దోపిడీ పాలకవర్గ నాయకులను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేవీ చలపతిరావు కోరారు. శుక్రవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీచేస్తున్న రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రసంగాలు మారాయని అన్నారు. ప్రజాస్వామ్య ఎన్నికలు పరిహాసమయ్యాయని పేర్కొన్నారు. డబ్బు, కులం, మతం ప్రజలను విభజించే ధోరణలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు ప్రజలను మభ్యపెట్టే విధానాలు వంటపట్టించుకున్నారని ధ్వజమెత్తారు. కాషాయీకరణ, హిందుత్వ ధోరణి, లౌకికవాదంతో పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాఉద్యమాలపై నిర్బంధం పెరిగిందని, ఉద్యమకారులపై ఉపా చట్టం ప్రయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులపై ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు పెరిగిపోయాయన్నారు. నిరుద్యోగం నాలుగు కోట్లకు చేరిందని, ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతన్నాయని అన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టుల్లో రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. ఈఎన్నికల్లో రెండు పార్టీలను ఓడించాలని కోరారు. నాయకులు కె.రాజన్న, ఇ.నరేశ్, ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఏర్పాట్లు

- రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అరుణశ్రీ

గోదావరిఖని: పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు. శుక్రవారం ఆబ్సెంట్ ఓటర్ ఎమర్జెన్సీ సర్వీస్ తొలిరోజు రామగుండం రిటర్నింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. తొలిరోజు ఏడుగురు ఉద్యోగులు ఏవీఈఎస్ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఈనెల 25, 26వ తేదీల్లో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజు 22మందికి ఏడుగురు, మిగిలిన 15మంది ఉద్యోగులు నవంబర్ 25, 26 తేదీల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. వీరికోసం ఎన్టీపీసీలోని ఈడీసీ, టీటీఎస్, ఎన్టీపీసీ ఆడిటోరియం హాల్‌లో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తూ ఇతర నియోజకవర్గాల్లో ఓటుహక్కు కలిగి ఉండి పోస్టల్ బ్యాలెట్ ఫారం12 దరఖాస్తు చేసుకున్న 625 మంది ఉద్యోగులకు, రామగుండం నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తూ రామగుండం నియోజకవర్గంలోనే ఓటుహక్కు కలిగి ఉండి పోస్టల్ బ్యాలెట్ ఫారం12 దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కలిపి ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ఈ ప్రక్రియకు హాజరు కావాలన్నారు.

మంథనిలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం

- బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు
- నియోజకవర్గంలో విస్తృత ప్రచారం

మంథని: ఈ మట్టిలో పుట్టి ఎదిగిన తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంథని చుట్టూ రింగ్ రోడ్డు నిర్మిస్తానని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు హామీ ఇచ్చారు. పట్టణంలో శాంతియుత వాతావరణం నెలకొల్పుతామన్నారు. శుక్రవారం ఆయన స్థానిక వాకర్స్, ఓపెన్ జిమ్ అసోసియేషన్ సభ్యులతో అల్పాహారం చేశారు. బొక్కలవాగును మినీ ట్యాంక్ బండ్‌గా నిర్మించామన్నారు. చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువులు, మైదానాల సుందరీకరించి పూర్తిచేయించామన్నారు. వాకింగ్ ట్రాక్స్‌లు, లైటింగ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈసందర్భంగావిద్యార్థులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు. అనంతరం హమాలీలతో కొద్దిసేపు మాట్లాడారు. కాగా, మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పుట్ట మధు, ఎన్నికల ఇన్‌చార్జి ఈద శంకర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆశీర్వదించండి.. సేవకుడిగా పనిచేస్తా

రామగిరి(మంథని): ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఐదేళ్లు సేవకుడిగా పనిచేస్తానని పుట్ట మధు కోరారు. బుధవారంపేట, రాజాపూర్, ఆదివారంపేటలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తానుబీసీ బిడ్డగా ఎదిగితే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. తనను అంతం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ నక్సలైట్లు, రౌడీయిజం చేసే వాళ్లను, స్మగ్లర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని తనను ఖతం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. నాయకులు శంకేశి రవీందర్, మ్యాదరబోయిన శారద, కాపురబోయిన శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులదే కీలకపాత్ర

తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులదే కీలక పాత్ర అని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. సింగరేణిలో కారుణ్య నియమాకం ద్వారా ఉద్యోగం పొందిన కార్మికులు చేపట్టిన పాదయాత్రలో ఆమె పాల్గొన్నారు. పుట్ట మధును గెలిపించాలని, సీఎం కేసీఆర్ మళ్లీ విజయం సాధిస్తే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆకాంక్షిస్తూ కారుణ్య నియామకమైన ఉద్యోగులు ఈ పాదయాత్ర చేపట్టారు. నాయకులు గౌతం శంకరయ్య, అల్లం పద్మ, పల్లె ప్రతిమ, కాపురబోయిన శ్రీదేవి, మ్యాదరబోయన కుమార్‌యాదవ్, దామెర శ్రీనివాస్, దాసరి మల్లేశ్, రేండ్ల సందీప్ పాల్గొన్నారు.

పాదయాత్ర అభినందనీయం

సింగరేణి కార్మికుల సమస్యలు సీఎం కేసీఆర్‌తోనే పరిష్కారమవుతాయనే భావనతో యువ కార్మికులు చేపట్టిన పాదయాత్ర అభినందనీయమని పుట్ట మధు అన్నారు. కారుణ్య నియామక ఉద్యోగులు చేపట్టిన పాదయాత్రకు మధు ఓసీపీ–2 వద్ద స్వాగతం పలికారు.

మధుకు మద్దతుగా ప్రచారం

కమాన్‌పూర్(మంథని): గుండారం, నాగారం, కమాన్‌పూర్‌లో ఎంపీపీ రాసకొండ లక్ష్మితోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పుట్ట మధుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

మధును భారీ మెజారిటీతో గెలిపించాలి

మల్హర్(మంథని): పుట్ట మధును భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఎడ్లపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. పేదల ఆకలి తీర్చాలనే ఆరాటం ఉన్న సేవకుడు పుట్ట మధుకర్ అని ప్రశంసించారు. బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ, సోషల్ మీడియా ఇన్‌చార్జి అక్కినవేన సుమన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పంతకాని వెంకట్‌రాజు, నాయకులు బాపు, రాధ శ్రీనివాస్, స్వరూప రమేశ్, నరేశ్, సత్యనారాయణ, బుచ్చయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ

మహదేవపూర్(మంథని): అంబట్‌పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ తోపుచర్ల సులోచనతోపాటు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఈద శంకర్‌రెడ్డి, నాయకుడు లింగంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మంథనిలో వాలీబాల్ ఆడుతున్న పుట్ట మధు


మహిళలను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

కాంగ్రెస్ అంటేనే నమ్మకం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు

మంథని: పేదవాడికి భరోసా కల్పించేలా పనులు చేసిన కాంగ్రెస్ పార్టీ అంటేనే నమ్మకమని మంథని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం మంథని మండలం దుబ్బపల్లి, బెస్తపల్లి, చిల్లపల్లి, సిరిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ మాట ఇస్తే తప్పేది కాదన్నారు. రైతులకు మెరుగైన కరెంట్ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని గుర్తుచేశారు. వ్యసాయ రంగానికి ఉచితంగా విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే అందించిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దుబ్బపల్లి గ్రామస్తులకు ఇళ్ల పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాల్లో వరదలు వచ్చినప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగి ప్రజలకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ఈవిషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో తాను లేవనెత్తినా బాధితులకు పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మించి నీళ్లు, ఇసుక తీసుకెళ్లి ప్రజలకు కష్టాలు మిగిల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే కరకట్టలు నిర్మించి నష్ట నివారణ చర్యలు చేపట్టనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీ ప్రకటిస్తూ ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులను ఆరు నెలలోనే భర్తీ చేస్తామని ఆయన చెప్పారు. అలాగే ఆడ బిడ్డ పెళ్లికి రూ.లక్ష సాయంతోపాటు తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 భృతి, ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందించి అండగా ఉంటామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఈ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇప్పటికే ఈ పథకాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు.

ముత్తారంలో కాంగ్రెస్ ప్రచారం

ముత్తారం(మంథని): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పత్రాలను అందిస్తూ ఆరు గ్యారంటీల గురించి ఓటర్లకు వివరించారు. మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్‌రావు, నాయకులు తూటి రఫీ, తాటిపాముల శంకర్, గాదం శ్రీను, కోల విజయ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీగా తరలి వస్తున్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు


ముత్తారంలో ఇంటింట ప్రచారం చేస్తున్న నాయకులు

ఇద్దరిపై కేసు

పెద్దపల్లిరూరల్: వాట్సాప్‌లో తనతో అసభ్యంగా చాట్ చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి ప్రాంతానికి చెందిన కర్రె నరేశ్, జడల రాజు అమ్మాయిల మాదిరిగా వాట్సాప్‌లో తనకు అసభ్యకరమైన రీతిలో మెస్సేజ్‌లు పంపారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పదేళ్లలో ఏం చేశారో చెప్పాలి


తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న చింతకుంట విజయరమణారావు

- కాంగ్రెస్ పెద్దపల్లి ఎమ్మెల్యేఅభ్యర్థి విజయరమణారావు
- వివిధ ప్రాంతాల్ల ఎన్నికల ప్రచారం

ఎలిగేడు: పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న దాసరి మనోహర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండలం కేంద్రంతోపాటు సుల్తాన్‌పూర్‌లో రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు. ఎలిగేడు మండలానికి పోలీస్‌స్టేషన్, జూనియర్ కాలేజ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. మండలానికి ఒక్క డబుల్‌బెడ్‌రూం అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిగుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు భూర్ల సింధూజ, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, గొల్లె కావేరి, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, అమ్ముల శ్రీనివాస్‌యాదవ్, భూర్ల వెంకటసత్యం, రంగు శ్రీనివాస్‌గౌడ్, కొండ తిరుపతిగౌడ్, బాలుసాని పర్శరాములుగౌడ్ పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయ ప్రచారం

పెద్దపల్లిరూరల్: 'మా నాన్నకు ఓటు వేయండి' అంటూ విజయరమణారావు కూతురు వైష్ణవి ఓటర్లను శుక్రవారం అభ్యర్థించారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పడుతున్న విజయరమణారావు కూతురు వైష్ణవి పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో ప్రచారం చేశారు. మాజీ ఎంపీపీ సునీత, మాజీ జెడ్పీటీసీ యాట దివ్య ప్రచారం ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావుకు ఓటు వేయాలని కాంగ్రెస్ నాయకురాలు, కౌన్సిలర్ ఎరుకల కల్పన, రమేశ్ కోరారు. పెద్దపల్లిలోని చీకురాయిరోడ్, చైతన్యకాలనీలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రాబోతుంది ఇందిరమ్మ రాజ్యమే

సుల్తానాబాద్: ప్రజలు మార్పు కోరుతున్నారని, రాబోతున్నది ఇందిరమ్మ రాజ్యమేనని కర్ణాటక సివిల్ సప్లై మంత్రి కేహెచ్ మునియప్ప అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని పూసాల, శ్రీరాంపూర్ చౌరస్తా, పాత జెండా, గట్టెపల్లి రోడ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావుతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆరు పథకాలు అమలు చేస్తామన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, రాష్ట్ర ప్లానింగ్ కమిటీ సభ్యులు ఊట్ల వరప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బిరుదు సమత, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, పాత తాలూకా చైర్మన్ దామోదర్‌రావు, మండల అధ్యక్షుడు సతీశ్, నాయకులు కుమార్ కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.


ప్రచారంలో విజయరమణారావు కూతురు వైష్ణవి

కాంగ్రెస్‌లోకి చేరికలు..

ఎలిగేడు: ఓదెల మండలం హరిపురం గ్రామానికి చెందిన పలువురు, జూలపల్లి మండలం వడుకాపూర్ జూలపల్లి గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శివపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్, జూలపల్లిలోని బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు గడ్డం నర్సింహారెడ్డి, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు


మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

పాలకుర్తి(రామగుండం): బీఆర్ఎస్ మాయమాటలను నమ్మి మోసపోవద్దని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు, రామగుండం నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శుక్రవారం బసంత్‌నగర్, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు కేశోరాం సిమెంట్ కర్మాగారం ఆవరణలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కరోనా సమయంలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇప్పించామని, గతంలో కార్మిక సంఘం అధ్యక్షుడిగా తాను పనిచేసినపుడు మూతపడే స్థితిలో ఉన్న కేశోరాం సిమెంట్ కర్మాగారాన్ని కంపెనీ యాజమాన్యంతో చర్చించి తిరిగి కొనసాగించేలా కృషి చేశానని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో మనాలీ ఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ: 17, 18, 19వ డివిజన్లలో మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ గురించి వివరించారు. చేతిగుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకులు ఆగమైతయ్


ఓదెల: కొలనూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి

ఓదెల(పెద్దపల్లి): కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకులు ఆగమైతయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొలనూర్, ఓదెల గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. ఎన్నికల అనంతరం కొలనూర్ మండల కేంద్రంగా ఏర్పాటవుతుందని, దీంతో చుట్టుపక్కల గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, ఎంపీపీ రేణుకదేవి, రైతుసమన్వయ సమతి మండల డైరెక్టర్ బండారి ఐలయ్యయాదవ్, ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, అధ్యక్షుడు పోలోజు రమేశ్, నాయకులు డాక్టర్ సతీశ్, మొగిలి పాల్గొన్నారు.

అసత్య ప్రచారం నమ్మొద్దు

సుల్తానాబాద్ (పెద్దపల్లి): ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాన్ని నమ్మి ప్రజలు మోసపోవద్దని పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, కౌన్సిలర్లు జ్ఞానేశ్వరి, మమత, అరుణ, గుర్రాల శ్రీనివాస్, గోపి, తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, ముత్యం రమేశ్, సంపత్, సాజిద్, సూర శ్యాం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన జిల్లా మాల సంఘం నాయకులు గొర్రె కర్ణం ఆధ్వర్యంలో 50మంది పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

కారుగుర్తుకు ఓటు వేయండి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ప్రతీ ఒక్కరు కారుగుర్తుకు ఓటేసి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. కూనారం, పెగడపల్లి, గంగారం, ఊశన్నపల్లె, ఇదులాపూర్ గ్రామాల్లో రోడ్‌షో చేపట్టారు. కూనారం, మీర్జంపేట, గంగారం, పెగడపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ నూనేటి సంపత్‌కుమార్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, సింగిల్‌విండో చైర్మన్లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం, సర్పంచులు మల్లారెడ్డి, రజిత, ఎంపీటీసీలు రమాదేవి, మానస, నిర్మల, కౌసల్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, సుజాత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొడ్డు రాజ్‌కుమార్, నాయకులు రాజమల్లు, సమ్మయ్య, రవీందర్, తిరుపతి, సతీశ్ పాల్గొన్నారు.


సుల్తానాబాద్ ప్రచారం చేస్తున్న మమతారెడ్డి

దాసరికి మద్దతుగా ప్రచారం

జూలపల్లి(పెద్దపల్లి): తేలుకుంటలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఇంటింటా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జూలపల్లిలో కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్, నాయకులు రాంగోపాల్ రెడ్డి, తాజ్ మహ్మద్, కారు గుర్తుకు ఓటు వేయాలని మైనార్టీ సోదరులను కలిసి అభ్యర్థించారు. పెద్దాపూర్‌లో తొగరు శ్రీనివాస్, పూరెల్ల గంగయ్య ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఎంపీటీసీ కత్తెర్ల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ నర్సింగం, షాబుద్దీన్, బొద్దుల సాయి, సతీశ్, కొండపల్లి కృష్ణమూర్తి, వెంకటేశ్, అంజయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు మండలంలో..

ఎలిగేడు: దాసరి మనోహర్‌రెడ్డిని గెలిపించాలని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

దాసరికి మద్దతుగా ప్రచారం

పెద్దపల్లిరూరల్: దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాఘవాపూర్‌లో ప్రచారం చేశారు. నాయకులు గాండ్ల సదయ్య, శ్రీనివాస్, రామస్వామి తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మొక్కట్రావుపేట, ముత్తునూర్, రాంనూర్, చెగ్యాం గ్రామాల్లో ప్రజాఆశీర్వాద యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ చీకటి రోజులేనని, మూడు గంటల కరెంట్ కావాలో మూడు పంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. గత 40 ఏళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి రావడానికి మోసపూరిత హామీలు ఇస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని మంత్రి కోరారు. సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి బీసీలకు ఇస్తాం

- హైదరాబాద్ పేరును భాగ్యనగర్ చేస్తాం


మాట్లాడుతున్న అస్సాం సీఎం హిమతి

చొప్పదండి: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే వరికి క్వింటాల్‌కు రూ.3,100 మద్దతు ధర చెల్లిస్తామని, పేదలకు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని, ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి బీసీలకు కేటాయిస్తామని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో శుక్రవారం బీజేపీ ప్రచార సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం రూ.97కే లీటర్ పెట్రోల్ అందిస్తోందని, తెలంగాణలో రూ.110 వసూలు చేస్తూ కేసీఆర్ పేదల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్ పేరు భాగ్యనగర్‌గా మారుస్తామన్నారు. రాష్ట్రానికి బీసీ సీఎం చేస్తామని ప్రకటించిన ఏకైక పార్టీ బీజేపీయేనన్నారు. మందకృష్ణమాదిగ కోరిన డిమాండ్ నెరవేరుస్తామన్నారు. కేసీఆర్‌పై విచారణ జరిపి జైలుకు పంపుతామని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. బీజేపీ చొప్పదండి అభ్యర్థి బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, చేపూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి


మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతమొందించేందుకు కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ధర్మపురి అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పథకాలు అమలు చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ కోడారి అంజన్న, మాజీ సర్పంచులు కొత్త మోహన్, దేవి పద్మ, మాజీ ఎంపీటీసీలు పాలకుర్తి రేణుకాదేవి, తోడేటి రాజలింగయ్య, నాయకులు దేవి జనార్దన్, పాలకుర్తి రాజేశంగౌడ్, ఓడ్నాల శంకరయ్య పాల్గొన్నారు. కాగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బాస తిరుపతిరావు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

గెలిచినా ఓడినా ప్రజలతోనే ఉన్నా

వెల్గటూర్: స్తంభంపల్లి, కొత్తపల్లికి చెందిన 50 మంది లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు మేలు


మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మి ఓటు వేస్తే మళ్లీ మోసపోవాల్సి వస్తుందని, బీజేపీతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కాటారం మండలం వీరాపూర్, గుమ్మల్లపల్లి, ఆదివారంపేట, దన్వాడ, దేవరాంపల్లి, గంగారాం, విలాసాగర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మంథని ప్రాంత రైతుల పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతోందని, వర్షాకాలంలో పంటపొలాలు మునిగి రైతులకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని సునీల్ విజ్ఞప్తి చేశారు.